క్లుప్తంగా

కోడ్ అమలుకు సహకరించాలి

మలికిపురం: ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాజోలు సీఐ గోవిందరాజు సూచించారు. రాజోలు నియోజకవర్గ ప్రజలంతా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎలక్షన్)లో ఉన్నాం అని, వాహనాలు (కార్, బైక్, ఆటో, వ్యాన్)తదితర వాహనాల మీద ఏ రాజకీయ పార్టీ సింబల్ కానీ పార్టీ జెండా కానీ రిటర్నింగ్ ఆఫీసర్ పర్మిషన్ లేకుండా ఉంటే మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ వయలేషన్ కింద కేసు నమోదు చేసి లీగల్‌గా యాక్షన్ తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు

అంబాజీపేట: ఇసుకపూడి శివారు జక్కంశెట్టి వారిపాలెంలో నూతనంగా ప్రతిష్ఠించే శ్రీనివాసునికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 27న శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ ఎస్ఎస్‌వీవీఎల్ఎన్ శర్మ (బుజ్జి) పర్యవేక్షణలో ప్రధాన దేవతారాధన తదితర పూజలు చేశారు.

ఎస్సీ వర్గీకరణ జోలికొస్తే బుద్ధి చెబుతాం

మామిడికుదురు: ఎస్సీ వర్గీకరణ జోలికి వస్తే టీడీపీకి తగిన బుద్ధి చెప్పేందుకు మాలలు సిద్ధంగా ఉన్నారని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు బొంతు మణిరాజు పేర్కొన్నారు. మామిడికుదురులో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ అన్నదమ్ముల్లా కలిసి ఉన్న మాల, మాదిగల మధ్య ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పేరుతో గతంలో చంద్రబాబు చిచ్చుపెట్టారని, మళ్లీ అదే ప్రయత్నం చేస్తే టీడీపీకి పుట్టగతులు లేకుండా చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఎస్సీలపై టీడీపీకి అభిమానం ఉంటే పెరుగుతున్న ఎస్సీ జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలన్నారు. మాల, మాదిగల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని దాని సాధన దిశగా దళితులు దృష్టి సారించాలని మణిరాజు సూచించారు.

కాటుమాయమ్మని దర్శించుకున్న గొల్లపల్లి



కాట్రేనిపాడులో అమ్మవారిని దర్శించుకుంటున్న గొల్లపల్లి

రాజోలు: కాట్రేనిపాడు గ్రామ దేవతలు కాటుమాయమ్మ, కనకమహాలక్ష్మి అమ్మవార్లను సోమవారం రాజోలు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు సూర్యారావుకు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాజోలులో వైఎస్సార్ సీపీ విజయానికి పాటుపడతామని ఆ గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు గొల్లపల్లికి హామీ ఇచ్చారు. సొసైటీ చైర్మన్ అడబాల రామప్రసాద్, నాయకులు పైడిపర్తి రామారావు, పైడిపర్తి రత్నాజీ, బండారు కాశీ తదితరులు పాల్గొన్నారు.


ప్రమాద భరితంగా నాలుగు రోడ్ల సెంటర్



ప్రమాదకరంగా ఉన్న ముక్కామల నాలుగు రోడ్ల సెంటర్

అంబాజీపేట: ముక్కామల నాలుగు రోడ్ల సెంటర్‌లో ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేవని తక్షణమే ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. ఈదరపల్లి నుంచి కొత్తపేట వెళ్లే వాహనాలు ముక్కామల నాలుగు రోడ్ల సెంటర్ వద్దకు వచ్చే సరికి కనీస నిబంధనలు పాటించకుండా వాహనాలు ఇష్టానుసారం నడుపుతున్నారని ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంతో హడలిపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే నాలుగు రోడ్ల సెంటర్‌లో స్పీడు బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

హోలీ జరుపుకొన్న కేంద్ర బలగాలు



హోలీ వేడుకల్లో పాల్గొన్న సీఐఎస్ఎఫ్ కమాండెంట్ సతీష్‌కుమార్, సీఐ ప్రశాంతకుమార్, ఎస్సై శివకృష్ణ

పి.గన్నవరం: ఎన్నికల బందోబస్తు నిమిత్తం పి.గన్నవరానికి విచ్చేసిన సీఐఎస్ఎఫ్ సిబ్బంది స్థానిక గ్రేస్ కళాశాల క్యాంప్‌లో సోమవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఒకరికొకరు రంగులు పూసుకుని సందడి చేశారు. సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ సతీష్‌కుమార్, ఆర్ఐ అశుతోష్ కరాటే, వారి బృందానికి పి.గన్నవరం సీఐ ప్రశాంత్ కుమార్, ఎస్సై బి.శివకృష్ణలు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగులకు భవిత

- మండలానికో కేంద్రం
- ఉచితంగా పరికరాల పంపిణీ

అంబాజీపేట: అవసరాలు గల పిల్లలపై ప్రభుత్వం దృష్టి సారించింది. సాధారణ పిల్లలతో కలసి వారు సాగేలా చర్యలు చేపడుతోంది. గృహ స్థాయిలో ఫిజియోథెరపీ అందిస్తోంది. ఆర్థిక తోడ్పాటు కూడా కల్పిస్తూ దివ్యాంగుల భవితకు భరోసా ఇస్తోంది. ఇలాంటి చిన్నారుల వికాసానికి భవిత కేంద్రాల్లో ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టింది. ఆ కేంద్రాల్లో ప్రత్యేక వాతావరణం ఉండేలా చేస్తోంది. వారిలో దాగిన సృజనాత్మకతను వెలికితీస్తుంది. అందరి పిల్లలతో కలసి దివ్యాంగులు జీవనం సాగించేందుకు ఐఈఆర్టీలు ప్రత్యేక దృష్టి సారించేలా ఆదేశాలు జారీ చేసింది. పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాల్లోను 100 మందికి 76, రాజోలు నియోజకవర్గంలో మూడు మండలాల్లోను 86 మందికి 67, కొత్తపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోను 107 మందికి 89 మంది విద్యార్థులు భవిత కేంద్రాలకు వస్తున్నారు. ఒక్కో భవిత కేంద్రంలో ఇద్దరు ఐఈఆర్టీ, ఆయాను నియమించారు. వారానికోసారి ఈ కేంద్రాలకు ఫిజియోథెరపిస్ట్ వచ్చి వారిలో వ్యాయామం చేయిస్తారు. దీంతో పాటు వ్యాయామం ఎలా చేయించాలో వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. ప్రతి శనివారం కదల్లేని వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు పలు అంశాలను వివరిస్తారు. ఫిజియోథెరపిస్టు వచ్చే సమయానికి భవిత కేంద్రానికి వచ్చేలా విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి సేవలు అందిస్తున్నారు.



మాచవరం భవిత కేంద్రంలో దివ్యాంగ బాలుడికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు, భవిత సిబ్బంది (ఫైల్)

అందుతున్న సేవలివి..

విద్యా, ఫిజియోథెరపీతో పాటు భవిత కేంద్రాలకు వచ్చే ప్రత్యేక అవసరాలు గల బాల బాలికలకు, ఇంట్లో ఉన్నవారికి నెలకు రూ.250 చొప్పున ఏడాదిలో పది నెలలు పాటు ప్రభుత్వం అలవెన్సు అందిస్తోంది. బాలికలకు ప్రత్యేకంగా పది నెలల కాలానికి రూ.2,500 ఫండ్ రూపంలో ఇస్తున్నారు. మానసిక దివ్యాంగులకు రూ.7వేల విలువైన ఎంఆర్ కిట్లను ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. మధ్యాహ్న భోజన పథకంతో పాటు బస్ పాస్‌లు, వినికిడి యంత్రాలు, చక్రాలు కుర్చీలు అందిస్తున్నారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందించి వారిలో చైతన్యం నింపుతున్నారు.

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ



భవిత కేంద్రానికి వస్తున్న దివ్యాంగ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. పిల్లల మనోభావాలను అనుసరించి వారికి పాఠాలు చెబుతున్నాం. ఆట పాటలతోనూ వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు కృషి చేస్తున్నాం. వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు శిక్షణ ఇస్తున్నాం. తరచూ ఆటలు పోటీలు నిర్వహించి చైతన్య పరుస్తున్నాం.

– ఎస్‌కే బేగం, భవిత కేంద్ర ఐఈఆర్టీ, మాచవరం

ముగిసిన కల్యాణోత్సవాలు



మాకనపాలెం సత్యనారాయణస్వామి ఆలయంలో చక్రస్నానం పూజల్లో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: ఐదురోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన మాకనపాలెం అనంతలక్ష్మి, భూదేవి సమేత సత్యనారాయణ స్వామి వారి 72వ వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు సోమవారం స్వామి వారి చక్రస్నానంతో సంపూర్ణమయ్యాయి. చివరి రోజు కావడంతో స్వామి దర్శనానికి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు స్వామి వారి వ్రతాలు ఆచరించారు. స్వామికి అభిషేకాలు చేయించారు. లక్ష్మీగుండంలో స్వామి వారి చక్రస్నానం ఆద్యంతం కనులపండువలా జరిగింది. బాణసంచా కాల్పులు, మేళ తాళాలు, భక్తుల కోలాహలం నడుమ చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం పొన్నవాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ముడుపులు, మొక్కులు చెల్లించారు.

ప్రమాదభరితంగా కల్వర్టు



ముక్కామల-వక్కలంక రహదారిలో ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టు

అంబాజీపేట: ముక్కామల నుంచి వక్కలంక వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో రోడ్డు కుంగిపోయి కల్వర్టు ప్రమాద భరితంగా ఉంది. ఈ రహదారి మార్గమధ్యంలో పంట బోదె ఏర్పాటు చేశారు. అయితే రోడ్డు మధ్యలో వేసిన తూర శిథిలమై రహదారి కుంగి ప్రమాదంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. వాహనదారులు, వృద్ధులు, చిన్నారులు అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. ప్రమాదంగా ఉన్న ప్రాంతంలో చీర క్లాత్‌ను ప్రమాద హెచ్చరికగా స్థానికులు ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాద భరితంగా ఉన్న ప్రాంతంలో రక్షణ ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

గోదావరి మాతకు పున్నమి హారతి

అలమూరు: మండలంలోని జొన్నాడలోని అఖండ గౌతమీ గోదావరి తీరంలో గౌతమీ గోదావరి మాతకు అఖండ పున్నమి హారతి జరిగింది. శోభకృత్ నామ సంవత్సర పాల్గుణ శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ వేద పండితులు ద్విభాష్యం రవికృష్ణ శర్మ, గొడవర్తి సుగుణ ఆధ్వర్యంలో మహిళ భక్త బృంద సభ్యులు తొలుత స్థానిక శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా గోదావరి చెంతకు చేరుకుని శాస్త్రోక్తంగా మహిళలు ఈ పున్నమి హారతిని చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీజనార్దన భజన మండలి సభ్యుల బృందం గ్రామంలోని వివిధ ఆలయాల్లో విష్ణు, లలిత సహస్ర నామాలు, కనకధార, అష్టోత్తరం, వేద పారాయణ పఠించారు.



జొన్నాడ పుష్కరఘాట్ వద్ద గోదావరి మాతకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

శ్రీకృష్ణుడే చైతన్య మహాప్రభువు

అయినవిల్లి: ఫాల్గుణ మాసం పౌర్ణమి రోజున దేవాదిదేవుడు శ్రీకృష్ణుడే శ్రీచైతన్య మహా ప్రభువుగా కలియుగంలో అవతరించారని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాసదాసు ప్రభుజీ అన్నారు. సోమవారం రాత్రి అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్‌లో స్వామికి విశేష పూజలు జరిపారు. స్వామిని కీర్తిస్తూ అనేక ప్రవచనాలు చేసి కీర్తనలు ఆలపించారు. శ్రీనివాస్ దాసు ప్రభుజీ మాట్లాడుతూ నిజమైన పండగ స్వామి వారు అవతరించిన ఈ రోజేనన్నారు. మనకు అంగ్ల, తెలుగు సంవత్సరం ఎలాగో ఇది కూడా అంత కన్నా పవిత్ర రోజుగా శ్రీచైతన్య మహాప్రభువు భక్తులు భావిస్తామన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మండే ఎండ.. కొబ్బరి నీరే అండ

- వేసవి తాపం తీర్చడంలో అమృత బాండం
- శీతల పానీయాలన్నింటిలో శేయస్కరం
- మనిషికి శక్తినిచ్చే విటమిన్లు, పోషకాలు మెండు

కొత్తపేట: ప్రకృతి సిద్ధంగా లభించే ద్రవ పదార్థాల్లో ఎలాంటి కలుషితం లేనిది ఒక్క కొబ్బరి బొండాం మాత్రమే. అమృతాన్ని తలపించే కొబ్బరి నీటిలో అనేక విటమిన్లు, పోషకాలు ఉన్నాయి. అంతటా లభించే కొబ్బరి బొండాలు మనిషికి అవసరమైన తక్షణ శక్తినిస్తాయి. కొబ్బరి బొండాలు వేసవిలో వడదెబ్బ భారీ నుంచి ప్రజలను కాపాడతాయి. వేసవి వచ్చిందంటే శీతల పానీయాలు చల్లని నీటిని తాగేందుకు ప్రజలు మక్కువ చూపుతారు. వీటన్నింటి కంటే కొబ్బరి నీరు ఎంతో శ్రేయస్కరం. కొబ్బరి నీటిలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయి. కొబ్బరి బొండం ద్వారా వేసవితాపం నుంచి విముక్తి పొందడంతో పాటు శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. మనిషి ఒంట్లో వేడిని, నీరసాన్ని తగ్గించే గుణం కొబ్బరి బొండాల్లో ఉంది. అందుకనే దీనిని సహజ సెలైన్ అంటారు. కొబ్బరి బొండాలు ఏడాది పొడవునా లభించినా వేసవి సీజన్‌లో మాత్రం డిమాండ్ అధికంగా ఉటుంది. ప్రస్తుతం వేసవి ఎండలు రోజురోజుకు ముదురుతున్నాయి. దాంతో ఎక్కడికక్కడ ముఖ్యంగా ప్రధాన రహదారుల పక్కన కొబ్బరి బొండాల దుకాణాలు వెలిశాయి. బొండాం పరిమాణాన్ని బట్టి రూ.20 నుంచి రూ.25 వరకూ విక్రయిస్తున్నారు. లీటరు (4, 5 బొండాలు) నీరు రూ.100 వరకూ విక్రయిస్తున్నారు.



అమలాపురం-కొత్తపేట రహదారిలో ఖండ్రిగ వద్ద కొబ్బరి బొండాలు విక్రయిస్తున్న వ్యాపారి

కొబ్బరి నీరుతో ప్రయోజనాలు



కొబ్బరి బొండం నీరు మనిషి శరీరంలో వేడిని తగ్గించి చల్లదనాన్ని ఇస్తుంది. వడదెబ్బ సోకిన వారికి కొబ్బరి నీరు తాగిస్తే శరీరంలో పోయిన లవణాలు తిరిగి వస్తాయి. మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పడవు. మూత్రాశయ వ్యాధులు దరిచేరవు. క్యాన్సర్ నిరోధకంగా పని చేస్తుంది. శరీరంలో లవణాల శాతాన్ని పెంచుతుంది. రక్తపోటు, గుండె పనితీరును క్రమబద్ధీకరిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. శరీర బరువు తగ్గించేందుకు దోహదపడుతుంది. డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం కలుగజేస్తుంది.

– డాక్టర్ ఎం.సుమలత, డివిజన్ వైద్యాధికారి, కొత్తపేట

సర్పంచ్ సోదరుడికి పరామర్శ

రాజోలు: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదలో గాయపడి చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న కడలి సర్పంచ్ చొప్పల గుణనాథ్ సోదరుడు సుధీర్‌ను గొల్లపల్లి సూర్యారావు పరామర్శించారు. సర్పంచ్ సోదరుడు సుధీర్‌కు రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయమైంది. కోలుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఆయన ఆరోగ్య పరిస్థితులను గొల్లపల్లి అడిగి తెలుసుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తెన్నేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక పరికరాలతో గుండెకు చికిత్స



రోగికి ఓసీటీ పరికరం సహాయంతో స్టెంటు వేస్తున్న వైద్యులు

అమలాపురం రూరల్: స్థానిక కిమ్స్‌లో అత్యాధునిక పరికరాలతో గుండెకు విజయవంతంగా చికిత్స నిర్వహించినట్లు మెడికల్ డైరెక్టర్ డాక్టర్ హరికిరణ్ వర్మ తెలిపారు. ఈ నెల 18న అంబాజీపేటకు చెందిన ఓ 57 ఏళ్ల వ్యక్తి ఛాతీ నొప్పితో గుండె వైద్యులు డాక్టర్ అభిషేక్ రవివర్మను సంప్రదించగా గుండెలో రక్తనాళాలు పూడుకుపోయి నొప్పి వస్తున్నట్లు గుర్తించారన్నారు. 22న కిమ్స్ గుండె వైద్య నిపుణులు అభిషేక్ రవివర్మ, గురు కిరణ్, నాగ గణేష్‌లతో కూడిన వైద్య బృందం రోగికి అత్యాధునిక ఓసీటీ పరికరం సహాయంతో రక్త నాళాల్లోకి కెమెరా పంపి గుండె లోపలి రక్తనాళాల దృశ్యాలను తెరపై చూస్తూ స్టెంటు అమర్చారన్నారు. ఈ ఆధునిక పరికరం వల్ల బైపాస్ సర్జరీ చేయవలసిన అవసరం లేకుండా స్టెంట్ వేయడం సాధ్యమైందని కార్డియాలజిస్ట్ అభిషేక్ రవివర్మ తెలిపారు. వైద్యుల పర్యవేక్షణలో పూర్తిగా కోలుకున్న రోగిని ఆరోగ్యంగా ఇంటికి పంపుతున్నామన్నారు.

ఘనంగా చండీ హోమం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి తిథిని పురస్కరించుకుని సోమవారం ఆలయ అర్చక స్వామి పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులు భద్రకాళి అమ్మవారికి గణపతి పూజ, చండీ పారాయణ, చండీ హోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

నేటి సమావేశాన్ని విజయవంతం చేయాలి

అమలాపురం రూరల్: స్థానిక వాసర్ల గార్డెన్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు జరగనున్న పట్టణ వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని నాని, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజులు పిలుపునిచ్చారు. అమలాపురం పట్టణంలో సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్యకర్తల సమావేశానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జేఏసీ కన్వీనర్ ఈత కోట శ్రవణ్, కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, సుంకర సుధ, దొంగ చిన్న, కల్వకొలను ఉమ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ స్ఫూర్తితో విజయానికి బాటలు

ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి

రాజోలు: సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో విజయానికి బాటలు వేయాలని రాజోలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పిలుపునిచ్చారు. ఆదివారం పొన్నమండలో జరిగిన సమావేశంలో గొల్లపల్లి మాట్లాడారు. వైఎస్సార్ సీపీకి ప్రతి ఇంటా అభిమానులు ఉన్నారన్నారు. సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్క కుటుంబానికీ దక్కాయన్నారు. అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుతో పాటు తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ఖరారు చేసిందన్నారు. అత్యధిక మెజార్టీతో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను విజయపథంలో నిలపాలన్నారు. గ్రామశాఖ అధ్యక్షుడు రాపాక శ్రీను, కుక్కల శ్రీనివాస్, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఎస్తేరురాణి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి తెన్నేటి కిషోర్, పార్టీ నాయకులు బండారు కాశీ, మోకా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పొన్నమండలో కార్యకర్తలతో సమావేశమైన గొల్లపల్లి సూర్యారావు

ఓటమి భయంతోనే వలంటీర్లపై నిందలు

రాజోలు: ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు వలంటీర్లపై నిందలు వేస్తున్నారని రాజోలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం ఆయన పొన్నమండ సర్పంచ్ కుక్కల బేబికుమారి, ఆమె అనుచరులను గొల్లపల్లి కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజసేవలో భాగస్వామ్యులైన వలంటీర్లను శ్రీకాళహస్తి టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి స్లీపర్‌సెల్స్, టెర్రరిస్టులుగా అభివర్ణించడం బాధాకరమన్నారు. పెత్తందారుల భావజాలాన్ని సుధీర్‌రెడ్డి వెళ్లగక్కారన్నారు. సేవాభావంతో నామమాత్రపు పారితోషికంతో సేవచేస్తున్న వలంటీర్లను చూస్తేనే ఓటమి భయంతో వణికిపోతున్నారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బండారు కాశీ తదితరులు పాల్గొన్నారు.



పొన్నమండలో మాట్లాడుతున్న గొల్లపల్లి సూర్యారావు

ఉపాధ్యాయులకు సరైన సౌకర్యాలు కల్పించాలి

అయినవిల్లి: ఎస్ఎస్‌సీ స్పాట్ వేల్యూయేషన్, ఎన్నికల విధులు నిర్వహిర్తించే ఉపాధ్యాయులకు సరైన సౌకర్యాలను కల్పించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు సిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ జిల్లా శాఖ ప్రథమ కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. పోతంశెట్టి దొరబాబు మాట్లాడుతూ పదో తరగతి మూల్యాంకన సెంటర్‌లో, ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులకు సరైన వసతులు కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రెమ్యునరేషన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి, బాలింతలు, దివ్యాంగులు, ఒక సంవత్సరంలోపు పదవీ విరమణ చేసే వారికి విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అయినవిల్లి మండల శాఖ అధ్యక్షులు దడాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు, ఆర్థిక కార్యదర్శి డి.రామకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేటివ్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చొప్పల రాంబాబు, మహిళా కన్వీనర్ వి.రత్నకుమారి, జిల్లా అసోసియేటివ్ అధ్యక్షుడు నల్లా రామకృష్ణ, పోల్నాటి ప్రసాద్, అదనపు ప్రధాన కార్యదర్శులు జి.రాధాకృష్ణ, నిమ్మన సత్యనారాయణ, వీవీవీ సత్యనారాయణ, జె.భీమారావు, మహిళా కార్యదర్శి ఎస్ఎం గ్రేస్, రాష్ట్ర కౌన్సిలర్లు జిల్లా కార్య నిర్వహణ సభ్యులు, మండల పట్టణ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

అలమూరు: మండలంలోని సంధిపూడికి చెందిన అరవలవల్లి అయోధ్య రాముడు (23) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అలమూరు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కథనం ప్రకారం కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన అయోధ్య రాముడు గ్రామంలోని తన అమ్మమ్మ గారింట వద్ద ఉంటూ ఉల్లిపాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఎవరూ లేని సమయంలో ఇంట్లోని పడక గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. అంతలో కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ ఉన్నాడు. స్థానికుల సాయంతో అతడిని ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయోధ్య రాముడు ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదని, లోతైన దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు. ఈ మేరకు గ్రామానికి వచ్చి ఆత్మహత్యకు గల కారణాలపై స్థానికులను ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు ఎస్సై కేసు నమోదు చేయగా రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.



అరవలవల్లి అయోధ్య రాముడు (ఫైల్)

ఆనందోత్సాహాలతో హోలీ



అమలాపురంలో హోలీ జరుపుకొంటున్న యువకులు

అమలాపురం టౌన్: ప్రేమ, స్నేహం, ఆప్యాయత, అనురాగంతో అమలాపురంలో హోలీ పండగను ప్రజలు సోమవారం ఆత్మీయ వాతావరణంలో జరుపుకొన్నారు. ముఖ్యంగా పట్టణంలో దశాబ్దాలుగా నివసిస్తున్న మార్వాడీ కుటుంబాలు చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా స్నేహభావంతో ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. వసంత రుతువులో పాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున జరుపుకునే ఈ హోలీ సంబరాల్లో సోమవారం ఉదయం నుంచి చిన్నారులు, యువత సందడి చేశారు. గోల్డ్ మార్కెట్, పుల్లయ్య రామాలయం సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు తదితర ప్రాంతాల్లో వేడుకలు వైభవంగా జరిగాయి.

ఓటు వజ్రాయుధం



ముమ్మిడివరంలో మానవ హారం నిర్వహిస్తున్న ఉద్యోగులు

ముమ్మిడివరం: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని నోడల్ ఆఫీసర్, సబ్ కలెక్టర్ ఎ.మధుసూదనరావు పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్(స్వీప్) కార్యక్రమంలో భాగంగా సోమవారం ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్యాలయ సిబ్బంది, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో మానవ హారం, అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయం నుంచి బళ్ల గేటు సెంటర్ మీదుగా లంక తల్లమ్మ గుడి వరకూ ర్యాలీ నిర్వహించి ఓటు హక్కు విలువ గురించి వివరించారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద మానవ హారం నిర్వహించి ప్రజలంతా తమ ఓటు హక్కు వినియోగించుకుని మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.